నవతెలంగాణ

నిజామాబాద్-కామారెడ్డి

1

బుధవారం 31 మే 2023

నేడు లింగంపేట్‌కు ప్రొ.కోదండరాం రాక

నవతెలంగాణ-లింగంపేట్

తెలంగాణ జన సమితి వ్యవస్థాపకులు ప్రొఫెసర్ కోదండరాం బుధవారం లింగంపేట మండల కేంద్రానికి రానునట్టు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మిద్దెన రమేశ్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. బుధవారం ఉదయం 10 గంటలకు మండల కేంద్రంలో టీజేఎస్ జెండా ఆవిష్కరించనున్నారని, అనంతరం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించనున్నట్టు తెలిపారు. కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా కన్వీనర్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా నాయకులు రజినీకాంత్ నేత, యువజన జిల్లా అధ్యక్షులు చాకలి కుమార్, జిల్లా నాయకులు పూల్ సింగ్ నాయక్, బీసీ సంఘం అధ్యక్షులు నీల నగరాజ్ లు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

నవతెలంగాణ-మొపాల్

మోపాల్ మండలంలోని మంచిప్ప గ్రామానికి చెందిన వడ్డే చిన్న నరసయ్య(37) కొన్ని సంవత్సరాల నుండి మతిస్థిమితం లేక సోమవారం రోజున తన ఇంట్లో ఎవరూ లేనప్పుడు పురుగుల మందు తాగాడు. అది గమనించిన కుటుంబ సభ్యులు నిజామాబాద్ జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. అతని భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ మహేశ్ తెలిపారు.

ప్రాణం తీసినా సరే
అనర్హులకు పథకాలు ఇచ్చేది లేదు

- స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ-నసురుల్లాబాద్


గ్రామస్తులతో మాట్లాడుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయని, నా ప్రాణం తీసిన సరే అనర్హులకు ఇచ్చేది లేదని రాష్ట్ర శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. నసురుల్లాబాద్ మండలంలోని దుర్కి గ్రామంలో పలు అభివృద్ధి పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. అంతకుముందు ఉదయం గ్రామానికి చేరుకుని గ్రామంలో పలు వీధుల్లో స్వయంగా వెళ్ళి గ్రామస్తులతో ముచ్చటించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 20 లక్షలతో అంబేద్కర్ భవనం నిర్మాణం, 20 లక్షలతో రజక సంఘ భవన నిర్మాణంకు భూమి పూజ చేశారు. దళితవాడలో ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో పలు వాడల్లో తిరుగుతూ గ్రామస్థులతో అభివృద్ధి సంక్షేమ పథకాలపై అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం ద్వారా ప్రతి కుటుంబానికి అందిస్తున్న సంక్షేమ పథకాలు వచ్చాయా? లేదా? ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుకున్నారు.

ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం కెసిఆర్ ప్రభుత్వం అని అన్నారు. బాన్సువాడ నియోజకవర్గం లో అనర్హులకు సంక్షేమ పథకాలు ఇచ్చేది లేదని స్పష్టంచేశారు.

దుర్కి గ్రామ అభివృద్ధిలో భాగంగా గ్రామానికి 100 డబుల్ బెడ్ రూమ్ములు మంజూరు కాగా ఇందులో 60 ఇండ్లు పూర్తయ్యాయని మిగత 40 ఇండ్ల పనులు కొనసాగుతున్నాయి అన్నారు. జూలై మాసం నుంచి మూడు లక్షల పథకం వస్తుందని అర్హులైన ప్రతి ఒక్కరికి గృహలక్ష్మి పథకం ఇస్తామన్నారు.

'ఈ ప్రతిపక్ష నేతలు ప్రజలకు మంచి జరుగుతుంటే కొందరు చూసి ఓర్వలేక ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నాలు చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో అమలు అవుతున్న పథకాలు ఇతర రాష్ట్రాల్లో ఇలాంటి పథకాలు అమలు కావడం లేదని' అన్నారు. ఇతర రాష్ట్రాల్లో ప్రజలకు కనీస సౌకర్యాలు అందించలేని ప్రభుత్వాలు ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పోచారం సురేందర్ రెడ్డి ఎంపీపీ పాల్త్య విఠల్, మాజీ గ్రంథాలయ చైర్మన్ డిప్యూటీ శ్రీనివాస్ యాదవ్, మాజీ జెడ్పిటిసి కిషోర్ యాదవ్, గ్రామ సర్పంచ్ శ్యామల శ్రీనివాస్, ఎంపీటీసీ డాక్టర్ నారాయణ, మండల కో ఆప్షన్ నెంబర్ ముస్తఫా హుస్సేన్, గ్రామ మాజీ సర్పంచ్ మోహన్, నాయకులు శంకర్ యాదవ్, మైసయ్య, మహేష్, మధు పటేల్, తదితరులు పాల్గొన్నారు.

దళారులకే మక్కలు

కేంద్రాల్లో నెమ్మదిగా సాగుతున్న మొక్కజొన్న కొనుగోలు

- ఖరీఫ్ సమీపిస్తుండటం, వర్షాల భయంతో అగ్గువకే అమ్ముకోవాల్సి దుస్థితి
- పాలకుల తీరుపై మండిపడుతున్న రైతులు

నవతెలంగాణ-సదాశివనగర్

మొక్కజొన్న కొనుగోలు నెమ్మదిగా సాగుతోంది. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినప్పుడు హడావుడి చేసిన పాలకులు, అధికారులు పత్తా పట్టించుకోక పోవడంతో కొనుగోలు ఆలస్యమవుతోంది. ఖరీఫ్ సాగు సమీపిస్తున్న తరుణంలో వర్షాలు పడే అవకాశం ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దళారులను ఆశ్రయించొద్దని సూచిస్తున్నా.. పాలకుల చర్యలు అంతిమంగా పంటను దళారులకే విక్రయించేలా ఉన్నాయని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


ధాన్యం కుప్పల కింద విషకీటకాలు

సదాశివనగర్ మండలంలోని పద్మాజివాడి ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో 20 రోజుల క్రితం మక్కల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కానీ ఇప్పటి వరకు కేవలం నాలుగు లారీల మక్కలు మాత్రమే కొనుగోలు చేశారు. సుమారు వెయ్యి మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది. కొనుగోలు కేంద్రాల తీరు ఈ విధంగా ఉంటే ఏడాది గడిచినా కొను గోళ్లు పూర్తవ్వవని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒక దిక్కు ఖరీఫ్ సీజన్ లోకి అడుగుపెడుతున్నాం. మరో దిక్కు ఆకాశం మబ్బులు కమ్ముకుంటూ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రైతులకు కంటి మీద కునుకు లేకుండా పోతోంది. వర్షాలకు మక్క కుప్పల కింద పాములు చేరుతుండటంతో రైతులు భయాందోళనకు గురవు తున్నారు. టార్పాలిన్ కవర్‌లను కప్పి పెట్టినా.. ఆలస్యం అవుతుం డటంతో చెదలు పడుతున్నాయని ఆవేదన చెందుతున్నారు.


ఎక్కడి మక్కల కుప్పలు అక్కడే

దళారులకు అగ్గువకే అమ్ముకుంటున్న రైతులు

మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కేంద్రాలు ప్రారంభించగా, కొనుగోలు ఆలస్యంగా సాగుతున్నాయి. ఒక వైపు ఖరీఫ్ సాగు సమీపిస్తుండగా.. మరో వైపు అకాల వర్షాలు కురుస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో దళారులను ఆశ్రయించక తప్పని పరిస్థితి నెలకొంది. పాలకులు దళారులను ఆశ్రయించొద్దని ప్రకటనలు చేస్తున్నా.. చర్యలు మాత్రం దళారులను ఆశ్రయించేలా ఉన్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. కొనుగోలు కేంద్రంలో క్వింటాలుకు ధర 1950 చెల్లిస్తుండగా, దళారులు మాత్రం 1400-1500 మాత్రమే చెల్లిస్తున్నారు. దీంతో క్వింటాకు సుమారు 500 మేర రైతులు నష్టపోతున్నారు.

లారీల కొరతతో ఆలస్యం

పద్మాజివాడి సొసైటీ చైర్మన్ గంగాధర్

లారీల కొరతతోనే కొనుగోలు ఆలస్యమవుతుంది. ఈ విషయం ఎమ్మెల్యే దృష్టికి కూడా తీసుకెళ్లాం. మార్క్‌ఫెడ్ అధికారులతో మాట్లాడి లారీల కొరతను అధిగమించి కొనుగోలును వేగవంతం చేస్తాం.

బండ ప్రకాష్‌కు సన్మానం


ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు బండప్రకాశ్‌ను సన్మానించిన ముదిరాజ్‌లు

నవతెలంగాణ-కంఠేశ్వర్

పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు మంగళవారం జిల్లాకు వచ్చి శాసన మండలి డిప్యూటీ చైర్మన్, తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు బండా ప్రకాశ్‌ను ఆర్అండ్‌బీ గెస్ట్ హౌజ్‌లో ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులు మెతుకు శివకుమార్ ముదిరాజ్ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఆయనతో పాటు వచ్చిన ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన వెంట జిల్లా ముదిరాజ్ నాయకులు మధు ముదిరాజ్, భూమయ్య ముదిరాజ్, సతీష్ ముదిరాజ్ ముదిరాజ్ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో ఒకరి మృతి

- ఇద్దరికి ఎల్‌సీ.. ఒకచోట పని పూర్తవ్వగానే కరెంట్ సరఫరా
- లైన్‌మెన్ నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆరోపణ

నవతెలంగాణ-డిచ్‌పల్లి


మృతిచెందిన బాబురావు

విద్యుత్ శాఖ అధికారి నిర్లక్ష్యంతో వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మంగళవారం ఇందల్ వాయి పోలీస్‌స్టేషన్ పరిధిలోని రంజిత్ నాయక్ తండా గ్రామ పంచాయతీలోని స్కూల్ తండాలో చోటుచే సుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇందల్ వాయి సబ్ స్టేషన్ పరిధిలోని పంట పొలాల వద్ద ఈదురు గాలులు ఇతర కారణాలతో మరమ్మతులు చేయించేందుకు ఇందల్‌వాయి గ్రామానికి చెందిన విద్యుత్ శాఖ లైన్‌మెన్ నాగరాజ్ ప్రైవేట్ వ్యక్తులతో పనులను చేయించాడానికి సబ్ స్టేషన్‌కు ఫోన్ చేసి ఎల్‌సి లైన్ క్లియర్ తీసుకున్నారు. చంద్రాయన్‌పల్లి మాజీ సర్పంచ్ పాల్త్య కిషన్ తమ్ముడు పాల్త్య బాబురావు (43) తన ఇంటి వద్ద సర్వీస్ వైర్ బాగు చేసుకోవడానికి లైన్మెన్ నాగరాజ్‌కు ఫోన్ చేసి ఎల్ సి ఇవ్వాలని కోరగా ప్రైవేటు వ్యక్తి, బాబురావు వేర్వేరు చోట్ల పనులు చేస్తుండడంతో ఇందల్ వాయి సబ్ స్టేషన్‌లో ఆపరేటర్‌కు ఫోన్ చేసి ఎల్‌సీ తీసుకున్నారు. కాని ప్రైవేట్ వ్యక్తుల పనులు పూర్తికాగానే వారు లైన్‌మెన్ నాగరాజుకు ఫోన్ చేసి పనులు పూర్తయ్యాయని చెప్పిన వెంటనే విద్యుత్‌ను పునరుద్ధరించారు. ఇంకో వ్యక్తి బాబురావుకు సైతం లైన్ ఇచ్చిన విషయం లైన్‌మెన్ మర్చిపోయి ఆపరేటర్‌కు ఫోన్ చేసి విద్యుత్‌ను పునరుద్ధరించారు. అప్పటికే బాబురావు ఇంటివద్ద సర్వీస్ వైర్ చేతిలో పట్టుకొని మరమ్మతులు చేస్తుండగానే ఒకేసారి విద్యుత్ రావడంతో షాక్ తగిలి అక్కడికక్కడే కింద పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఇందల్‌వాయి మండల కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకొని రాగా పరిస్థితి విషమంగా నిజామాబాద్‌కు తరలించారు. ఆసుపత్రిలో చేరిన కొద్దిసేపటికి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు.

కుటుంబ సభ్యులు ఇందల్ వాయి పోలీస్ స్టేషన్ కు చేరుకొని లైన్‌మెన్ నాగరాజ్ నిర్లక్ష్యంతో బాబురావు విద్యుత్ షాక్ తగిలి మృతి చెందాడని ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫిర్యాదు చేశారు. వారిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని మార్చురికి తరలించారు. మృతుడికి భార్య గంగుబాయి, ఇద్దరు కుమారులు ఉన్నారు. విషయం తెలుసుకున్న తాండవాసులు, ఇతర గ్రామాల ప్రజలు తండాకు చేరుకొని బోరున విలపించారు. అందరితో కలిసిమెలిసి ఉండే బాబురావు విద్యుత్ షాక్‌తో మృతి చెందడంతో తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఐక్య కార్మికోద్యమ వారధి సీఐటీయూ

- పోరాటాల్లో పాల్గొని పాలకవర్గ కుట్రలను బహిర్గతం చేయాలి
- సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవ సభలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఐక్య కార్మిక ఉద్యమ వారధి సీఐటీయూ నాయకత్వంలో జరిగే పోరాటాల్లో కార్మికులు పాలకవర్గ కుట్రలను బహిర్గతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ పిలుపునిచ్చారు. సీఐటీయూ 53వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని నగరంలోని హమాల్‌వాడీలోని సీఐటీయూ కార్యాలయం ఎదుట జెండా ఎగుర వేశారు. అనంతరం నిర్వహించిన సభలో నూర్జహాన్ మాట్లాడారు. 1970 మే 30వ తేదీనా సీఐటీయూ ఆవిర్భవించిందని తెలిపారు. సిఐటియు కార్మికులను ఐక్యం చేసి సంఘం నిర్మాణం చేసి పోరాటాల దిశగా ముందుకెళుతూ ఉద్యోగ కార్మికులహక్కుల కోసం నిర్విరామమైన పోరాటం చేస్తుందని అందుకు హక్కులు సాధించు కోగలుగుతున్నామని తెలిపారు. ఐక్యత పోరాటం నినాదంతో రాష్ట్రంలో అనేక కార్మిక సంఘాలు ఉద్యోగ భద్రత సాధించుకున్నాయని కేంద్ర రాష్ట్ర కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జాతీయ సమ్మెలు సదస్సులు ర్యాలీలు చేస్తూ కార్మికుల హక్కులను సాధించు చున్నదని తెలిపారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం 42 కేంద్ర కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు కోడులుగా విభజించటం వల్ల కార్మిక వర్గం తీవ్ర అన్యానికి గురవుతుందని కొత్తగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు కార్మిక కోడ్ లను రద్దు చేయాలని కనీస వేతనాలు చట్ట ప్రకారం 26000 అమలు చేయాలని డిమాండ్ చేశారు. కులాల పేరుతో మతాల పేరుతో దేశంలో జరుగుతున్న దాడులను వెంటనే అరికట్టాలని 137 సంవత్సరాల క్రితం సాధించు కున్న హక్కులను ఎనిమిది గంటల పని విధానాన్ని రద్దు చేస్తూ 12 గంటల పని విధానాన్ని తీసుకొస్తు న్నకేంద్ర ప్రభుత్వంపై కార్మిక చట్టాల సాధనకై నిరంతరం పోరాడుతున్నదని పోరాడితేనే హక్కులు సాధించగలమని కళ్లెదుటే నిరూపిస్తున్న సంఘం సిఐటియు అని అన్నారు. ఉద్యోగ కార్మికులు కొంతమేరకు హక్కులు సాధించారంటే అది సిఐటియు ద్వారానే సాధ్యమైందని అందుకే సిఐటియు అనుబంధంగా మరో మారు రాష్ట్రంలో కనీస వేతనాలు ఉద్యోగ భద్రత చట్టబద్ధమైన పీఎఫ్ ఈఎస్ఐ సౌకర్యాలను సాధించాలంటే ఉధృతమైన పోరాటాల ద్వారానే సాధ్యమని అందుకు కార్మిక వర్గం అంతా రాబోయే కాలంలో పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఏ రమేష్ బాబు, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గోవర్ధన్, ఈవీఎల్ నారాయణ, జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాస్ రాజ్, జిల్లా కమిటీ సభ్యులు కటారి రాములు, కృష్ణ, పశుమిత్ర జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మౌనిక, లక్ష్మి, బీడీ జిల్లా నాయకులు విమలమ్మ, ఫారూఖ్, గంగామణి, యాస్మిన్, జరీనా, తదితరులు పాల్గొన్నారు.


జెండా ఆవిష్కరిస్తున్న నూర్జహాన్.. నినదాలు చేస్తున్న నాయకుల

అవినీతి వీసీ
రాజీనామా చేసి వెళ్లిపోవాలి

అవినీతి నుంచి దృష్టి మరల్చేందుకు వివాదాలు

టీయూలో వీసీ చాంబర్‌ను ముట్టడించిన విద్యార్థి సంఘాలు


వీసీ చాంబర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ అవినీతి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ రవీందర్ తన పదవికి రాజీనామా చేసి వెళ్లిపోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. డిచ్‌పల్లిలోని టీయూలో వీసీ చాంబర్‌ను పీడీఎస్‌యూ, ఎన్ఎస్‌యూఐ, బీవీఎం విద్యార్థి సంఘాల నాయకులు మంగళవారం ముట్టడించారు. వీసీని ఘెరావ్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు జన్నారపు రాజేశ్వర్, వేణు రాజ్, విట్టల్ మాట్లాడారు. డిమాండ్ చేశారు. యూనివర్సిటీలో విద్యార్థులు ఫీజులు కట్టిన డబ్బులను వీసీ విచ్చల విడిగా ఖర్చు చేశారని, యూనివర్సిటీ ఖజానా ఖాళీ చేశారని, ఉద్యోగాల పేరుతో లక్షలాది రూపాయలు తీసుకొని అక్రమ నియామకాలు చేశారని ఆరోపించారు.

వివరాలు మెయిన్‌లో..

గ్రామగ్రామాన దశాబ్ది ఉత్సవాలు

- అపశృతులు చోటుచేసుకోకుండా ఏర్పాట్లు చేయాలి
- సమీక్షలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ ఆదేశం


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పక్కా ప్రణాళికతో గ్రామగ్రామాన అట్టహాసంగా చేపట్టి విజయవంతం చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. దశాబ్ది ఉత్సవ ఏర్పాట్ల సన్నద్ధతపై మంగళవారం కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని శాఖల మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న దశాబ్ది వేడుకలను అట్టహాసంగా నిర్వహించేందుకు అన్ని స్థాయిలలో స్పష్టమైన ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. ప్రతి కార్యక్రమానికి ఇంచార్జ్‌లను నియమించుకుని నిశితంగా పర్యవేక్షణ జరపాల న్నారు. ఆయా కార్యక్రమాల వివరాలను రోజు వారీగా సేకరిస్తూ, జిల్లా స్థాయిలోనూ పర్యవేక్షణ కోసం ప్రత్యేక విభాగం ద్వారా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. క్షేత్ర స్థాయిలో నిర్వహించిన కార్యక్రమాల ఫోటోలు, వీడియోలు, డాక్యుమెంట్లతో కూడిన వివరాలను రోజువారీగా సాయంత్రం నాలుగు గంటల లోపు జిల్లా కంట్రోల్ రూమ్‌కు పంపిం చాలని సూచిం చారు. అన్ని శాఖల అధికారులు మొదలుకుని క్షేత్ర స్థాయి సిబ్బంది వరకు ప్రతి ఒక్కరు పాలుపంచు కోవాలని సూచించారు. గడిచిన తొమ్మిదేళ్ల కాలంలో వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన సంక్షేమాభి వృద్ధి, ప్రజలకు చేకూర్చిన లబ్ది ప్రతిబింబించేలా సంబంధిత శాఖల ద్వారా గ్రామాలలో జూన్ 01 నాటికి ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రొటోకాల్‌ను అనుసరిస్తూ ప్రజాప్రతినిధులను దశాబ్ది కార్యక్రమాలకు ఆహ్వానించాలని అన్నారు. ఎంపీడీఓలు, తహసీల్దార్లు అందరిని సమన్వయము చేసుకుంటూ ఉత్సవాల విజయవంతానికి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ముఖ్యంగా జూన్ 03న రైతు దినోత్సవం సందర్భంగా అన్ని రైతు వేదికలను అందంగా ముస్తాబు చేయాలని, ప్రతి గ్రామం నుండి రైతులను సమీకరించి అలంకరించిన ఎడ్ల బండ్లు, ట్రాక్టర్ల ద్వారా ప్రదర్శనగా తరలి వచ్చేలా చూడాలన్నారు. ముందుగా జాతీయ గీతాలాపనతో కార్యక్రమాన్ని ప్రారంభించి, ఆదర్శ రైతులు, రైతు బంధు, రైతు బీమా లబ్దిదారులతో వారి అనుభవాలను వివరింపజేయాలని, ముందస్తు పంటలు వేయాల్సిన ఆవశ్యకత, ఆయిల్ పామ్ సాగు ప్రయోజనాల గురించి రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. జూన్ 08న తెలంగాణ చెరువుల పండుగ కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములయ్యేలా చొరవ చూపాల న్నారు. ఎలాంటి అపశ్రుతులు, లోటుపాట్లకు తావులేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. జూన్ 15 పల్లె ప్రగతి కార్యక్రమాలను అన్ని గ్రామ పంచాయతీలలో ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించాలని, 16న మున్సి పాలిటీల పరిధిలో పట్టణ ప్రగతి కార్యక్రమాలు జరపాలని అన్నారు. ర్యాలీలు, మానవ హారం, రంగోలీ పోటీలు, కళాజాత ప్రదర్శనలు నిర్వహించాలని, 17 న జీ.పీలుగా ఏర్పడిన జిల్లాలోని 71 గిరిజన తండాలలో పెద్ద ఎత్తున నిర్దేశిత కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. 18 న మంచినీళ్ల పండుగ సందర్భంగా మిషన్ భగీరథ ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకుల నుండి గ్రామ పంచాయతీల వరకు ర్యాలీలు జరపాలని, 19న హరితోత్సవం కార్యక్రమానికి విస్తృత ఏర్పాట్లు చేస్తూ ప్రతి పల్లెలో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని ఆదేశించారు. జూన్ 22న అమరుల సంస్మరణ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ అమరవీరులను మౌనం పాటించి నివాళులర్పించాలన్నారు. మొత్తంగా జూన్ 02 నుండి 22 వ తేదీ వరకు వివిధ స్థాయిలలో జరిగే దశాబ్ది ఉత్సవాలలో అన్ని శాఖల ఉద్యోగులు పాల్గొని, సమిష్టి తత్వంతో పనిచేస్తూ వేడుకలను విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ట్రైనీ అడిషనల్ కలెక్టర్ కిరణ్మయి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వ్యవసాయ పనులపై అవగాహన

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి


మాట్లాడుతున్న వ్యవసాయాధికారి మల్లయ్య

మండలంలోని ఉప్లూర్ రైతు వేదిక భవనంలో మంగళవారం ఈ వానకాలం చేపట్టాల్సిన వ్యవసాయ పనులపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న భీంగల్ సహాయ వ్యవసాయ సంచాలకులు మల్లయ్య మాట్లాడుతూ వరి పంటను ముందస్తుగా సాగు చేయాలని, రోహిని కార్తెలో వరి నారు పోసుకోవాలని రైతులకు సూచించారు. భూసారం పెరగడానికి పచ్చిరొట్ట ఎరువును ప్రభుత్వం 65 శాతం సబ్సిడీపై అందిస్తుందన్నారు. పచ్చిరొట్టె ఎరువులవల్ల 25 శాతం రసాయన ఎరువులను తగ్గించి భూసారం పెంచుకోవచ్చని తెలిపారు. రైతులకు కావలసిన విత్తనాలు కమ్మర్ పల్లి సొసైటీ పరిధిలో అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సోయాబీన్ పంటలో విత్తన మొలక శాతాన్ని పెంచే విధానంపై, సాగు విధానంలో తీసుకోవాల్సిన మెళుకువలను రైతులకు తెలిపారు. జూన్ 3న తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా తెలంగాణ రైతు దినోత్సవం గురించి వివరించి రైతులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బద్దం పద్మ చిన్నారెడ్డి, కమ్మర్ పల్లి సింగిల్ విండో చైర్మన్ రేగుంట దేవేందర్, గ్రామ రైతు బంధు సమితి కోఆర్డినేటర్ బద్దం భాస్కర్ రెడ్డి, వ్యవసాయ విస్తీర్ణ అధికారి రమేష్, రైతులు బోనగిరి భాస్కర్, తిరుపతిరెడ్డి, బద్దం మోహన్, బక్కురి దేవేందర్, కొమ్ముల రవీందర్, నేను ఎనెడ్ల ప్రసాద్, కొమ్ముల దేవేందర్, వన్నెల రాజేశ్వర్, బాజన్న, తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-ముప్కాల్

బుధవారం ఉదయం 11గంటలకు ఎంపీపీ సామ పద్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించడం జరుగుతుందని మండల అభివృద్ధి అధికారి దామోదర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని సూచించారు. ఇట్టి ఈ విషయాన్ని మండల ప్రజాప్రతినిధులు, గ్రామ, మండల స్థాయి అధికారులు గ్రహించాలని కోరారు.

నవతెలంగాణ
నిజామాబాద్
2
బుధవారం 31 మే 2023

ఖానాపూర్‌లో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు



నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని నూతన ఖానాపూర్ గ్రామంలో లక్ష రూపాయల విలువగల సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయడం జరిగిందని సర్పంచ్ సింగిరెడ్డి మోహన్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి కృషితో బడుగు, బలహీన, పేద ప్రజల సంక్షేమానికి నిర్విరామ కృషి చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, వీడిసి సభ్యులు, యూత్ మెంబర్స్, మహిళా సంఘాల ప్రతినిధులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

25 మంది విద్యార్థులు గురుకులాలకు ఎంపిక

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని వేంపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు గురుకుల ఫలితాలలో మంచి ఫలితాలు సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాంబారు లక్ష్మీ నారాయణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 33 మంది విద్యార్థులకుగాను 25 మంది విద్యార్థులు వివిధ గురుకుల పాఠశాలలలో సీట్లు పొందారని తెలిపారు. ఎంపికైన పాఠశాల విద్యార్థులను సర్పంచ్ జక్క మల్లుబాయి, ఉప సర్పంచ్ జక్క గంగాధర్, ఎంపీటీసీ సభ్యులు జోషి వెంకట్ రాజు, సొసైటీ ఛైర్మన్ జక్కరాజేశ్వర్, పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ పిప్పెర గణేష్ అభినందించారు.

పొగాకు ఉత్పత్తులు ప్రాణాంతకం

- పొగపీల్చడం రోగాలకు కారణం
- పెరుగుతున్న పొగాకు వాడకం
- నేడు అంతర్జాతీయ పొగాకు వ్యతిరేక దినోత్సవం

నవతెలంగాణ-ఆర్మూర్

సరదా కోసం అలవాటు పడి మనం గుప్పు గుప్పుమని పీలుస్తున్న సిగరెట్లు ప్రాణాలను హరిస్తున్నాయి. మనం నమిలే గుట్కా పాన్, జార్దా పాన్ పరాక్ తంబాకు తదితర పొగాకు ఉత్పత్తుల వాడకం క్యాన్సర్‌కు దారితీస్తోంది .పొగాకు తాగడం నేడు ఒక ఫ్యాషన్‌గా మారింది. చిన్న, పెద్ద లేకుండా అనేక రోగాల బారిన పడుతున్నారు. అనేక ఆరోగ్య సమస్యలతో సతమతమవుతూ అనారోగ్యానికి గురవుతున్నారు. నేడు బుధవారం అంతర్జాతీయ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా కథనం.

వివిధ రూపాల్లో పొగాకు వినియోగం..

పొగాకును వివిధ రూపాల్లో వినియోగించడం రోజురోజుకు పెరిగిపోతుంది.. పొగాకు ఉత్పత్తుల వినియోగం నియంత్రణకు ప్రజల్లో చైతన్యం లేదు. కారణంగా పొగాకు వాడకం తగ్గడం లేదు. ఫలితంగా గుండె జబ్బులు, క్యాన్సర్లు, ఊపిరితిత్తుల వ్యాధులు, కిడ్నీ వైఫల్యం తదితర ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్నారు. పొగాకు వినియోగం దెబ్బతీస్తోంది. విలువైన ప్రాణాలు కోల్పోతున్నారు. వ్యక్తులు నష్టపోవడమే కాకుండా సామాజికంగా ఎన్నో కష్టాలు చోటు చేసుకుంటున్నాయి. పొగరాయుళ్ల గుప్పు గుప్పున వదిలే దాని ఉత్పత్తులతో సమాజానికి వాటిల్లుతున్న ప్రమాదంపై ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక పలు హెచ్చరికలు చేసింది.

వరల్డ్ యాంటీ టొబాకో డే..

ప్రతి సంవత్సరం మే 31 వరల్డ్ యాంటీ టొబాకో డేగా ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. దీంతో 1987 నుంచి ప్రపంచ పొగాకు వ్యతిరేక దినంగా పాటిస్తున్నారు. ఈరోజు ప్రపంచ వ్యాప్తంగా పొగాకు వినియోగానికి ప్రజలంతా దూరంగా ఉండాలని నిర్ణయించారు. పొగాకు ఉత్పత్తులతో జరుగుతున్న తీరును ప్రచారం చేయాలని అనుకున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా ప్రకారం 20వ శతాబ్దంలో 100 మిలియన్ మరణాలు కేవలం పొగాకు ఉత్పత్తులతో జరుగుతున్నవి. 10 మందిలో సిగరెట్ తాగే వారి కన్నా పక్కన ఉండి పీల్చేవారికి ఎక్కువ జబ్బులు వచ్చే ప్రమాదం పొంచి ఉందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇలా పొగ తాగకుండా జబ్బుల బారిన పడే వారిని పాసెన్ స్మోకర్ అంటారు. తలనొప్పి, తల తిరగడం, నిద్రలేమి, నోరు, గొంతు, అల్లర్లు, పుండ్లు పిచ్చి కలలు, అల్సర్, కడుపులో మంట జీర్ణాశయ క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, మూత్రాశయానికి సంబంధించిన సమస్యలు వస్తాయని వైద్యులు చెబుతున్నారు. పొగాకులో ఉండే నికోటిన్ క్షణాల్లోనే మెదడుకు చేరుకుంటుంది. వెనువెంటనే మెదడులో దోఫామైన్ అనే రసాయనిక పదార్థాలను విడుదల చేస్తుంది. ఈ ప్రక్రియ ద్వారా పొగ తాగే వారిలో



నమిలే వారిలో మత్తు అనుభూతి ఉంటుంది. తద్వారా అవి లేకుండా గడపలేని స్థితికి చేరుకుంటారు. పొగాకు పీల్చడం నమలడంతో నికోటిన్‌తోపాటు నాలుగు వేల రకాల విష కారకాలు 43 రకాల క్యాన్సర్ కారకాలు శరీరంలో ప్రవేశిస్తాయి. కేంద్ర ప్రభుత్వం సిగరెట్లు ఇతర పొగాకు ఉత్పత్తులపై చట్టంలో కీలకమైన మార్పులు తీసుకువచ్చింది. ఈ చట్టం ప్రకారం బహిరంగ ప్రదేశాల్లో పొగాకు ఇతర పొగాకు ఉత్పత్తులను వినియోగంపై వ్యక్తులకు తగు జరిమానా విధించవచ్చు. ఈ జరిమానా విధించే అధికారం పోలీసులు ఆహార డ్రగ్స్ కంట్రోల్ అధికారులకు ఇచ్చింది ప్రభుత్వం ఈ చట్టం ప్రకారం బస్టాండ్లు ,రైల్వే స్టేషన్ ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాలయాలు, ప్రజలు గుమిగూడే బహిరంగ ప్రదేశాలలో సిగరెట్, బీడీలు తాగిన అది నేరం కింద లెక్క. 2008లో మరోసారి ఈ చట్టానికి సవరణలు జరిగాయి బహిరంగ ప్రదేశాలు అంటే ఏమిటో స్పష్టమైన వివరాలు ఇవ్వడంతోపాటు దాదాపు మూడుసార్లు ఏ వ్యక్తి అయినా పట్టుబడితే సదరు వ్యక్తికి 500 వరకు జరిమానా విధించవచ్చని పేర్కొన్నారు.

అమలులో చిత్తశుద్ధి ఎక్కడ..

పొగాకు ఉత్పత్తుల వినియోగం బహిరంగ ప్రదేశాలలో నిషేధిస్తూ నిబంధనలు స్పష్టంగా ఉన్నప్పటికీ అమలు చేయడంలో చిత్తశుద్ధి లోపించింది.. చుట్టుపక్కల ఉన్నవాళు అధికారులకు ఫిర్యాదు చేయడం లేదు. అధికారులు స్పెషల్ డ్రైవ్ సందర్భాలలో పొగాకు తాగేవారికి జరిమానా విధిస్తారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు సంస్థల అధికారులు, మేనేజర్లు సూపర్వైజర్లు బాధ్యత వహించాల్సి ఉంటుంది. అయితే ఎక్కడ అమలు కావడం లేదు.

మత్తు పదార్థాలకు బానిసలు కావద్దు



బీడీ, సిగరెట్ తాగడం వల్ల ఎన్నో అనారోగ్య సమస్యలు వస్తాయి. క్యాన్సర్ తదితర భయంకర వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. మత్తు పదార్థాలకు బానిసలై విలువైన ప్రాణాలను కోల్పోవద్దు..

డాక్టర్ యు. రాకేష్ కుమార్, వైద్యులు, బాలరాజ్ మెమోరియల్ హాస్పిటల్, ఆర్మూర్

రూరల్ ఎమ్మెల్యేను కలిసిన నియోజకవర్గ వ్యవసాయ అధికారులు

నవతెలంగాణ-మోపాల్

నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్‌ను రూరల్ ఎమ్మెల్యేను నియోజకవర్గ వ్యవసాయ అధికారులు మంగళవారం కలిశారు. ఈసందర్భంగా వ్యవసాయ ఏడి ప్రదీప్ కుమార్, మోపాల్ మండల వ్యవసాయ అధికారి రవీందర్‌తోకలిసి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న దశాబ్ది ఉత్సవాలకు సంబంధించిన వివరాలను తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా మూడో తేదీన రైతు దినోత్సవం చేపడుతూ ప్రతి మండల కేంద్రంలోగల రైతు వేదికలో సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అలాగే ఎమ్మెల్యేను ఆహ్వానిస్తున్నట్లు వారు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తమది రైతు ప్రభుత్వమని దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా అతి ముఖ్యమైనది రైతు దినోత్సవం అని అన్నారు. కార్యక్రమంలో రూరల్ మండలాలకు సంబంధించిన వ్యవసాయ అధికారులు రాంబాబు, ప్రవీణ్, దేవిక తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులను పరామర్శించిన రైతు సంఘం ప్రతినిధులు

నవతెలంగాణ-ఆర్మూర్


పరామర్శిస్తున్న నాయకులు

పట్టణంలోని పెర్కిట్ మాజీ సర్పంచ్ నల్ల హనుమంత్ రెడ్డి తండ్రి నల్ల వెంకటరెడ్డి ఇటీవల మరణించారు. వారి కుటుంబాన్ని మంగళవారం అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం ఏఐపీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, సిపిఐఎంఎల్ ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి దేవారం, మండల కార్యదర్శి కిషన్ వెంకట్ రెడ్డి కి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆ కుటుంబానికి సానుభూతి వ్యక్తం చేశారు. వీరితోపాటు కుటుంబ స్నేహితులైన కాంతి విద్యాసంస్థలు అధిపతి క్రాంతి గంగారెడ్డి,, చరణ్. తదితరులు పాల్గొన్నారు .

4న బహుజన చైతన్య సభ

- రూరల్ జిల్లా ఇంచార్జ్ గైని గంగాధర్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

డిచ్‌పల్లిలో జూన్ 4న బహుజన చైతన్య సభ పెద్ద ఎత్తున నిర్వహించనున్నామని జిల్లా ఇంచార్జి గైని గంగాధర్ అన్నారు. మంగళవారం బహుజన సమాజ్ పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పూసల గల్లీలో జిల్లా ఉపాధ్యక్షులు సిలుమల గణేష్ అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా ఇంచార్జి గైని గంగాధర్ విచ్చేసి మాట్లాడారు. సందర్భంగా మాట్లాడుతూ..జూన్ 4 న డిచ్ పల్లి కేంద్రంలోని ఎస్ ఎల్ జి ఫంక్షన్ హాల్ లో మధ్యాహ్నం 3 గంటలకు బహుజన చైతన్య సభ భారీ ఎత్తున నిర్వహించనున్నామని బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఈ సభకి ముఖ్యఅతిథిగా రానున్నారని తెలిపారు. అమరులు త్యాగంతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో ప్రజల ఆశలు, ఆశయాలు అడియాశలు అయ్యాయని అన్నారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ ప్రజలకు అనేక రకాల హామీలు ఇచ్చి వాటిని విస్మరించారన్నారు. నీళ్ల నిధులు నియామకాలు అన్న హామీలను తుంగలో తొక్కి తెలంగాణ ప్రజలను, నిరుద్యోగులకు అన్యాయం చేశారన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు గణేష్ మాట్లాడుతూ.. రూరల్ సమస్యల పరిష్కారం కోసం నిర్వహించ తలపెట్టిన ఈ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రూరల్ ఇంచార్జి కళ శ్రీనివాస్, బిఎస్పి జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్ల శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎర్రోళ్ల గంగాధర్, రూరల్ నియోజకవర్గ అధ్యక్షులు పోతే ప్రవీణ్ బీఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీ భవనానికి భూమి పూజ


భూమిపూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని శ్రీరామ్ నగర్ తాండ గ్రామపంచాయతీ భవనానికి ఎంపీపీ లతా కన్నిరాం జడ్పిటిసి కమలా నరేష్‌తో కలిసి సర్పంచ్ ధరావత్ పరశురాం, జడ్పిటిసి నరేష్‌తో కలిసి మంగళవారం భూమిపూజ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కేసీఆర్ ముందు చూపవల్ల బాజిరెడ్డి గోవర్ధన్ ఆశీర్వాదంతో తండాలను గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్ది తమను కూడా గ్రామ సర్పంచులుగా ఎంపిటిసిలుగా రాజకీయంగా అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ తమ మండల అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తూ ఎల్లప్పుడూ మండల అభివృద్ధి గురించి ఆలోచిస్తూ అడిగిన వెంటనే తమ పనులను కాదనకుండా మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్ శ్రీనివాసరావు సర్పంచులు ముత్యంరెడ్డి, కోలాగంగాధర్, ఇందూరిసిద్ధార్థ, బాడ్సి సొసైటీ చైర్మన్ నిమ్మల మోహన్ రెడ్డి, ఎంపీటీసీ రాములు, బీఆర్ఎస్ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి పార్టీ ప్రచారంపై ఉన్న చిత్త శుద్ధి రైతులపై లేదు : వైఎస్ఆర్‌టీపీ

నవతెలంగాణ-వేల్పూర్



ప్రభుత్వానికి పార్టీ ప్రచారంపై ఉన్న శ్రద్ధ రైతులపై లేదని వైయస్సార్ తెలంగాణ పార్టీ బాల్కొండ నియోజకవర్గ నాయకులు పిప్పెర లావణ్య అన్నారు. మండలంలోని పడగల్, వన్నెల్ (బి) గ్రామంలో వరి కల్లాలను ఆమె సందర్శించి మాట్లాడారు. అకాల వర్షాలతో ధాన్యం తడిసి రైతులు నష్టం పోతున్నారని అన్నారు. కొనుగోలు కేంద్రాన్ని ప్రతి గ్రామంలో పెట్టామని ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంటోందని, వరి కోసి రెండు నెలలు అవుతున్న ఇప్పటివరకు కొనుగోలు చేయడం లేదని అన్నారు. దీంతో రైతులు ప్రైవేట్ వ్యక్తులకు తక్కువ ధరతో అమ్ముకుంటున్నారని వాపోయారు. తరుగు పేరుతో రెండు నుండి 8 కిలోల వరకు తక్కువగా కొనుగోలు చేయడం వల్ల రైతులు నష్ట పోతున్నారని అన్నారు. వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ప్రభుత్వం ఇవ్వకపోవడంతో పెట్టు బడులు కూడా రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను వెంటనే అరెస్టు చేయాలి

- అంతర్జాతీయ క్రీడాకారులపై ఢిల్లీలో జరిగిన పోలీసుల దమన కాండను ఖండించండి
- హెచ్ఆర్ఎఫ్, ఐద్వా, పీఓడబ్ల్యూ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

అంతర్జాతీయ మహిళా క్రీడాకారులు భారత రెజ్లర్లపై బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ సింగ్ లైంగిక వేధింపులు, అత్యాచారాలను నిరసిస్తూ ఢిల్లీ కేంద్రంగా ఉద్యమిస్తున్నట మహిళా మల్లయోధులపై ఆదివారం ఢిల్లీలో కొత్త పార్లమెంటుకు ర్యాలీగా వెళ తుండగా అమానవీయంగా, విచక్షణ రహితంగా పోలీసుల దమనకాండ జరిగింది. ఈ దమనకాండను దేశ ప్రజలంతా ఖండించాలనీ , మహిళ రెజ్లర్లకు మద్దతుగా మహిళా, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం రాత్రి నిజామాబాద్‌లో కొత్త బస్టాండ్ నుండి గాంధీ చౌక్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా హెచ్ఆర్ఎఫ్ జిల్లా కార్యదర్శి సరిత, ఐద్వా జిల్లా కార్యదర్శి సుజాత, పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు ఆకుల అరుణ మాట్లాడుతూ.. లైంగిక వేధింపులకు పాల్పడి దర్జాగా పార్లమెంట్లో కూర్చుంటూ, బయట బహిరంగంగా తిరుగుతున్న బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ సింగ్‌ను వెంటనే అరెస్టు చేయాలన్నారు. అంతర్జాతీయ క్రీడల్లో పతకాలు తెచ్చినప్పుడు వారితో ఫోటోలు దిగిన ప్రధాని, నేడు వాళ్ళ గురించి మాట్లాడకపోవడం ఆయన చిత్తశుద్ధి కి నిదర్శనం అన్నారు. ఒకవైపు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో రౌడీ షీటర్లను ఎన్కౌంటర్ల పేరుతో చంపుతున్న యోగి ప్రభుత్వం, అదే బిజెపి ఎంపీపై రౌడీషీటర్ కేసులు 25కుపైగా క్రిమినల్ కేసులు ఉన్న బ్రిజ్ భూషణ్‌ను కనీసం అరెస్టు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత భారత సాధారణ మహిళలే కాకుండా అంతర్జాతీయ క్రీడాకారులకు కూడా రక్షణ లేకుండా పోయిందని తెలిపారు. వెంటనే బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి అనిత, పీఓడబ్ల్యూ నాయకులు లక్ష్మి నీలం, రాధ, స్నేహిత, ఐద్వా నాయకులు కళావతి, విజయ, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి జెల్ల మురళి, నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎల్‌బి రవి, శివ కుమార్, పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షులు సాయిరెడ్డి, నాయకులు సత్యం, భాస్కర్, అన్వేష్, సందీప్ ఐఎఫ్‌టీయూ నాయకులు మోహన్, రాజు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

పొగడ్తలు కాదు.. వేతనాల పెంపు కావాలి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



మాట్లాడుతున్న నాయకులు

పొగడ్తలు కాదు, వేతనాల పెంపు కావాలని ఐఎఫ్టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.సూర్యం అన్నారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర జేఏసీ ఉద్యమ కార్యచరణ నేపథ్యంలో తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్టియు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎన్.ఆర్ భవన్, కోటగల్లీలో జిల్లా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా కే.సూర్యం మాట్లాడుతూ పంచాయతీ కార్మికులు చాలీచాలని వేతనాలతో కుటుంబ పోషణ భారమై ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారన్నారు. వేతనాలు పెంచకుండా దశాబ్ది ఉత్సవాల్లో పారిశుద్ధ్య కార్మికులను సఫాయన్నా.. నీకు సలాం అన్నా అని గౌరవించాలని, ఉత్తమ పారిశుధ్య కార్మికులను సన్మానించాలని సీఎం కేసీఆర్ ప్రకటించడం విడ్డూరమన్నారు. సన్మానాలు చేస్తే కడుపు నిండుతుందా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వారి పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా పిఆర్‌సి నివేదిక ప్రకారం బేసిక్ వేతనం 19వేల రూపాయలు చెల్లించి, ఇతర సమస్యలు పరిష్కరించాలన్నారు. ఐఎఫ్టియు రాష్ట్ర అధ్యక్షుడు వనమాల కృష్ణ మాట్లాడుతూ...పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని, పంచాయతీ సిబ్బంది వేతనాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక గ్రాంట్‌ను ఏర్పాటు చేయాలని అన్నారు. జీవో నెంబర్ 51 సవరించాలని, మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని తెలిపారు. 5 లక్షలు ఇన్సూరెన్స్ సౌకర్యం ప్రమాద బీమా 10 లక్షలు కల్పించాలన్నారు. సదస్సులో పంచాయతీ యూనియన్ జిల్లా అధ్యక్షులు వెంకన్న, ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు ఎం.ముత్తెన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.నరేందర్, జిల్లా ఉపాధ్యక్షులు డి.రాజేశ్వర్ జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లేష్, ఆర్. రమేష్ జిల్లా నాయకులు సత్యక్క, మురళి, అశోక్, రాజన్న, లక్ష్మణ్, సుధాకర్, బాబన్న, రాజేశ్వర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఓట్లకోసం వచ్చే కాంగ్రెస్, బిజెపి నాయకులను చీపురుతో కొట్టాలి

- మంత్రి మల్లారెడ్డి


మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి

నవతెలంగాణ-మాక్లూర్

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్, బిజెపి నాయకులు ఓట్ల కోసం వస్తే మహిళలు చీపుర్లతో కొట్టాలని మహిళ కార్యకర్తలకు మంత్రి మల్లారెడ్డి ఆదేశించారు. మంగళవారం మండలంలోని మామిడిపల్లి గ్రామంలోని వంజర కుల సంఘం ఫంక్షన్ హల్‌లో బీఆర్ఎస్ మండల కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి మల్లారెడ్డి పాల్గొని మాట్లాడారు. కవితక్క ఎంపి అయితే నిధులే నిధులు, జీవోలే జీవోలు వచ్చేవని అన్నారు. అనంతరం ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. పార్టీ కండువా కప్పుకొని ప్రతి క్షణం కష్టపడిన ప్రతి ఒక్కరికీ అవకాశాలు వస్తాయని, పార్టీ కోసం పని చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఎంపిటిసిలు, సర్పంచులు ఎక్కువగా మహిళలే ఉన్నారని, బాధ్యతగా పనులు చేద్దామని తెలిపారు. జీవన్ రెడ్డి పట్టుదల కలిగిన వ్యక్తి అని, అవసరమైతే బుజ్జగించి, గడ్డం పట్టుకోవడం, కాళ్ళు మొక్కి తన వైపు తిప్పుకుంటారని అన్నారు. జీవన్ రెడ్డితో పోటీలో ఉంటే ప్రతి పక్షాలకు మైసమ్మకు పొట్టేలు బలిచినట్లు అవుతుందని తెలిపారు. అత్యధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా జెడ్పీ చైర్మన్ దాదాన్నగరి విఠల్ రావు, ఎంపిపి మస్త ప్రభాకర్, ఆకుల లలిత, బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

అర్హులైన అందరికీ పెన్షన్లు మంజూరు చేయాలి

కలెక్టర్‌కు బీజేపీ నాయకుల వినతి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

అర్హులైన అందరికీ పెన్షన్లు మంజూరు చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి న్యాలం రాజు అన్నారు. భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఆసరా పెన్షన్ల విషయమై జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...రాష్ట్రం ఏర్పడి పది సంవత్సరాలు పూర్తవుతున్న అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని ఇక్కడ ఎమ్మెల్యేలు, మంత్రి చెప్తున్నా ఇప్పటికీ అర్హులైన వారందరికీ ఆసరా పెన్షన్లు ఇవ్వలేదు అని అన్నారు. గత నాలుగు సంవత్సరాలలో ఇప్పటి వరకు కొత్తవారికి ఒక ఆసర్ పెన్షన్ ఇవ్వలేదన్నారు. 57 సంవత్సరాల నుండి వృద్ధులకు, 2014 కంటే ముందు పిఎఫ్ ఉన్నటువంటి బిడి కార్మికులకు, భర్త చనిపోయిన వారికి ఆసరా పెన్షన్లు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల ప్రభుత్వం జిల్లాలో 48 వేల మంది లబ్దిదారులకు కొత్త పెన్షన్‌లు మంజూరు చేసినప్పటికీ అందులో కొంతమందికి మాత్రమే అందుతున్నాయని, ఇంకా 20వేలకు పైగా అర్హులైనవారికి పెన్షన్ అందడం లేదన్నారు. కార్యక్రమంలో దొంతుల రవి, శిలా శ్రీనివాస్, నాగారజు, ఇప్పాకాయల కిషోర్, పిల్లి శ్రీకాంత్, యెండల సురేష్, విజయ్, చందుపట్ల శ్రీనివాస్, లక్ష్మణ్, గిరబాబు, యెండల ఓం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాజిరెడ్డి జగన్ పుట్టినరోజు వేడుకలు

- సోమవారం రాత్రి బాజిరెడ్డి నివాసానికి చేరుకున్న చేరుకున్న ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు
- కేక్ కట్‌చేయించి శుక్షాంక్షలు తెలుపుతూ బర్త్‌డే వేడుకలు

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్/జక్రాన్‌పల్లి



నిజామాబాద్‌రూరల్: జగన్‌ను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

బీఆర్ఎస్ యువ నాయకుడు, జిల్లా పరిషత్ ఆర్థిక ప్రణాళిక సంఘం సభ్యులు, ఒలింపిక్ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు, ధర్పల్లి జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ మోహన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎక్కడ చూసినా ఫ్లెక్సీలు, ఎక్కడికక్కడ కటౌట్లు, యువకులు, నాయకులు ఎంపీటీసీలు, ఎంపీపీ, వైస్ ఎంపీపీ, జడ్పిటిసి సర్పంచులు, పిఎసిఎస్ చైర్మన్లు, కార్యకర్తలు, గ్రామ అభివృద్ధి నాయకులు, తదితరులు జగన్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు.

మల్లారం లింగేశ్వర ఆశ్రమంలో

మల్లారంలోని లింగేశ్వర ఆశ్రమంలో జగన్ పేరుపైన అర్చన పూజలు చేయించారు. వైస్ ఎంపీపీ అన్నం సాయిలు మాట్లాడుతూ జగన్ వచ్చే సంవత్సరం నాటికి ఉన్నత స్థానంలో ఉండాలని, ఇంకా మరిన్ని పదవులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో నిజామాబాద్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మీసాల మధుకర్ రావు, గుండారం పీఏసీఎస్ చైర్మన్ శ్రీధర్, మాజీ చైర్మన్ రాయుడి బాలరాజు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మోపాల్: బీఆర్ఎస్ నాయకులు బాజిరెడ్డి జగన్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయన ఆయురారోగ్యాలతో ఉంటూ రాజకీయంగా ఇంకా ఎన్నో ఉన్నత పదవులు పొందాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి లతా కన్నిరం, జెడ్పీటీసీ కమల నరేష్, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు శ్రీనివాస్ రావు, సొసైటీ చైర్మన్ నిమ్మల మోహన్ రెడ్డి, ఉమపతి రావు, సర్పంచ్‌లు ముత్యం రెడ్డి. సిద్ధార్థ, సాయరెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు మొచ్చు శ్రీనివాస్, కెంపు భూమయ్య పాల్గొన్నారు.


మల్లారంలో పుట్టినరోజు వేడుకలు నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

జక్రాన్‌పల్లి:మండలంలోని అర్గుల్ గ్రామంలోని గడ్డం నారాయణ ఫంక్షన్ హాల్ లో మండల బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ కుమారుడైన బాజిరెడ్డి జగన్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. బాజిరెడ్డి జగన్‌తో కార్యకర్తలు, నాయకులు కేక్ కటింగ్ చేయించి గజమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మాజీ ఎమ్మెల్సీ విజి గౌడ్, జిల్లా ఆర్థిక ప్రణాళిక సభ్యుడు బాజిరెడ్డి జగన్, ఐడిసిఎంఎస్ చైర్మన్ సంబారి మోహన్, జడ్పిటిసి తనుజ శ్రీనివాస్ రెడ్డి కుంచాల విమల రాజు వైస్ ఎంపీపీ తిరుపతిరెడ్డి కోఆప్షన్ నెంబర్ బుల్లెట్ అక్బర్ ఖాన్, మండల పార్టీ అధ్యక్షుడు నట్టభోజన్న, మండల రైతు బంధు అధ్యక్షుడు ఢీకొండా శ్రీనివాస్, మాజీ ఎంపీపీలు సర్పంచులు ఎంపీటీసీలు అన్ని గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.


జక్రాన్‌పల్లి : గజమాలతో సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

కాంగ్రెస్ ఎన్నారై సెల్ కోఆర్డినేటర్ నియామకం



నవతెలంగాణ-భిక్కనూర్

కాంగ్రెస్ పార్టీ ఎన్ఆర్ఐ సెల్ జిల్లా కోఆర్డినేటర్‌గా చిట్టెడి సుధాకర్ రెడ్డిని నియమించినట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కైలాస్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం మాజీ మంత్రి షబ్బీర్ అలీ చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందజేశారు. అనంతరం సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో అప్పగించిన పదవికి తగిన న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, కామారెడ్డి మండలాధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు గోనే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రజకులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి



నవతెలంగాణ-భిక్కనూర్

రజక కులస్తులకు ప్రభుత్వం రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందజేసి ఆదుకోవాలని రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు గోపి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రజక కులస్తులను ఎస్సీ జాబితాలో చేర్చాలని, దళితులకు అందిస్తున్న దళితబంధు తరహాలో రజక బంధు అమలు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో రజక సంఘం ప్రతినిధులు రవి, సాయిలు, చంద్రం తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ రికవరీ

- బాధితులకు అందజేసిన ఎస్ఐ

నవతెలంగాణ-లింగంపేట్



సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్ఐ

మండలంలోని ఐలాపూర్ గ్రామానికి చెందిన మన్నే రమేష్‌కు చెందిన తన ఫోను పోయిందని రెండు రోజుల క్రితం స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా.. రెండు రోజుల వ్యవధిలోనే ఫోన్ రికవరీ చేసినట్టు ఎస్సై శంకర్ తెలిపారు. గత రెండు రోజుల క్రితం సెల్‌ఫోన్ పోవడంతో బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు ఆ ఫోన్‌ను సీఈఐఆర్ ద్వారా ట్రాక్ చేసి అతనికి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఎవరైనా తమ ఫోన్‌ను పోగొట్టుకున్నట్లయితే వెంటనే ఆ ఫోన్ ఐఎంఈఐ నెంబర్, ఫోన్‌లో వాడే నెంబర్‌తో వచ్చి పోలీస్‌స్టేషన్‌లో దరఖాస్తు ఇవ్వాలని, సీఈఐఆర్ ద్వారా ట్రాక్ చేసి పోగొట్టుకున్న ఫోన్ తిరిగి ఇప్పిస్తామన్నారు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

అంగన్వాడీ చిన్నారుల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

- పీహెచ్‌సీ కంటి వెలుగు ఇంచార్జ్ వైద్యాధికారి రాజ్‌కుమార్

నవతెలంగాణ-ఎడపల్లి



ద్రావణాన్ని వేస్తున్న వైద్యాధికారి

అంగన్వాడీ చిన్నారుల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని పీహెచ్‌సీ కంటి వెలుగు ఇంచార్జ్ వైద్యాధికారి రాజ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని జానకంపేటలోని అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు విటమిన్ ఏ ద్రావణాన్ని వేశారు. కంటి జబ్బులు రాకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా, రే చీకటి భవిష్యత్తులో రాకుండా ఈ ద్రావణం ఎంతో పని చేస్తుందని ఆయన అన్నారు. తొమ్మిది నెలల నిండిన చిన్నారి బాల బాలికలకు తప్పకుండా విటమిన్ ఏ ద్రావణం తప్పనిసరిగా వేయించాలని ఆయన అంగన్వాడీ ఉపాధ్యాయులకు సూచించారు. నిమోనియం కంటి జబ్బులు భవిష్యత్తులో రాకుండా ఈ ద్రావణం చిన్నారి ఆరోగ్యాలను పలు కంటి చూపును కాపాడుతుందని ఆయన స్పష్టం చేశారు. ఆయన వెంట అంగన్వాడీ కేంద్రం ఉపాధ్యాయురాలు సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-బోధన్

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బోధన్ అంబేద్కర్ చౌరస్తాలో ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ దిష్టిబొమ్మను మంగళవారం దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు తలారి నవీన్ మాట్లాడుతూ.. నష్టపోయిన రైతులను ఆదుకుంటానని, మొలకెత్తిన ధాన్యాన్ని స్వయంగా నేనే కొంటానని హామీ ఇచ్చి నెల రోజులైనా ధాన్యం కొనుగోలు చేయకపోవడం సమంజసం కాదని అన్నారు. అలాగే డబుల్ బెడ్ రూం పంపిణీ చేయలేదని, మైనార్టీల 12శాతం రిజర్వేషన్‌పై స్పందించడం లేదని, దళితులకు ఇస్తానన్న మూడు ఎకరాల భూ పంపిణీ చేయలేదని అన్నారు. కార్యక్రమంలో టౌన్ జనరల్ సెక్రెటరీ హరికాంత్ చారి, జిల్లా మైనార్టీ వైస్ చైర్మన్ బడు, మైనార్టీ అధ్యక్షులు కలీం, పోశెట్టి, చిరంజీవి, ఇనాయత్, జహీర్, ప్రసాద్, ఆర్.నవీన్, లక్ష్మీనారాయణ, లక్ష్మణ్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డిలో ఎంపీటీసీ ఎడ్ల రేణుక, వీడీసీ అధ్యక్షుడు ఎడ్ల నర్సింలు అమ్మ ఎడ్ల రాజవ్వ సోమవారం అనారోగ్యంతో మరణించింది. మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ అనంతరం అంత్యక్రియలలో పాల్గొన్నారు. నర్సింలును ఓదార్చారు. ఆయన వెంట బీఆర్‌యస్ మండలాధ్యక్షుడు బొలిపెల్లి మహేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు పుల్గం సాయిరెడ్డి, జడ్పీటీసీ నర్సింలు, శీను పనాయక్, ఏలేటి భూంరెడ్డి, రాజలింగం, పైడి జనార్దన్, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

వైన్స్‌షాప్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-నసురుల్లాబాద్ (బాన్సువాడ)

బాన్సువాడ డివిజన్ పరిధిలో గల వైన్ షాప్ నిర్వాహకులపై ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోవాలని బాన్సువాడ డివిజన్ సీపీఐ కన్వీనర్ దుబాస్ రాములు డిమాండ్ చేశారు. మంగళవారం బాన్సువాడ సీపీఐ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాన్సువాడ పట్టణంలోని వైన్స్ షాపుల నుంచి బెల్ట్ షాపులకు మద్యం సరఫరాను నిలిపివేయాలని, బెల్ట్ షాపులను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వైన్ షాపులకు అనుబంధంగా ఉన్న పర్మిట్ రూములు నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారని ఆయన తెలిపారు. పర్మిట్ రూములా లేక బార్ రూములా అన్న విధంగా కనబడుతున్నాయని తెలియజేశారు. సంబంధిత ఎక్సైజ్ శాఖ అధికారులు రెగ్యులర్‌గా వైన్ షాపులను తనిఖీలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బెల్టు షాపులకు విచ్చలవిడిగా మద్యం సరఫరా చేస్తున్న వైన్‌షాప్ నిర్వాహకులపై సంబంధిత ఎక్సైజ్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో గంగాధర్, రాజయ్య దుర్గాప్రసాద్, సాయిప్రసాద్, సీపీఐ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి చేయూత

నవతెలంగాణ-భిక్కనూర్

నిరుపేద కుటుంబాలకు ఎల్లవేళలా అండగా ఉంటానని కేవైసీఎస్ అధ్యక్షులు జోగిని రమేష్ తెలిపారు. మంగళవారం మండలంలోని కాచాపూర్ గ్రామంలో పూరిగుడిసెలో ఉంటున్న వారి ఇబ్బందులను చూసి టర్పాలిన్ అందజేశారు. కార్యక్రమంలో గ్రామ యువకులు శ్రీనివాస్‌గౌడ్, రమేష్, లతీఫ్, లింగం, రహీప్ పాల్గొన్నారు.

ఘనకీర్తి చాటేలా

అవతరణ దినోత్సవ వేడుకలు

- గ్రామాల్లో పండగ వాతావరణంలా కనిపించాలి
- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి
- అధికారులతో, ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశం



మాట్లాడుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-విలేకరుల బృందం

(బాన్సువాడ)నసురుల్లాబాద్ : ఈసారి తెలంగాణ అవతరణ వేడుకలను తెలంగాణ ఘనకీర్తి దశ దిశలా చాటేలా అవతరణ దినోత్సవ వేడుకలు జరిగేలా చూడాలని జిల్లా అధికారులకు, ప్రజాప్రతినిధులకు, కార్యకర్తలకు శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం బాన్సువాడ నియోజకవర్గ కేంద్రంలోని ఓ కళ్యాణ మండపంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు సందర్భంగా జిల్లా డివిజన్ మండల స్థాయి అధికారులతో, ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు జూన్ 2 నుంచి 21 రోజులపాటు నిర్వహించనున్నట్లు స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. జూన్ 2న ఉత్సవాలు ప్రారంభమవుతాయని వివరించారు. జూన్ 3న కర్షకులతో కలిసి సహపంక్తి భోజనాలు, 4న సురక్షా దినోత్సవం, 5న విద్యుత్ దినోత్సవం, 6న పారిశ్రామిక రంగ దినోత్సవం, 7న సాగునీటి దినోత్సవం, 8న ఊరురా చెరువుల పండగ, 9న సంక్షేమ సంబరాలు, 10న సుపరిపాలన దినోత్సవం, 11న సాహిత్య దినోత్సవం,12న తెలంగాణ రన్, 13న మహిళా సంక్షేమ దినోత్సవం, 14న వైద్య ఆరోగ్య దినోత్సవం, 15న పల్లె ప్రగతి దినోత్సవం, 16న పట్టణ ప్రగతి దినోత్సవం, 17న తెలంగాణ గిరిజన దినోత్సవం, 18న మంచినీళ్ల పండగ, 19న హరితర దినోత్సవం, 20న విద్యా దినోత్సవం, 21న ఆధ్యాత్మిక దినోత్సవాలను జరుపుకోవాలని స్పీకర్ సూచించారు. పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్న తొమ్మిదేండ్ల అనతికాలంలోనే దేశానికే ఆదర్శంగా పాలన కొనసాగిస్తూ, పదవ వసంతం లోకి అడుగిడుతున్న చారిత్రక సందర్భంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను అత్యంత వైభవోపేతంగా, ఘనంగా జరుపుకోవాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావును ఆదేశించారని తెలిపారు. ఈ ఉత్సవాలు తెలంగాణ సమాజ ఆకాంక్షలకు అనుగుణంగా, తెలంగాణ ఘనకీర్తి దశదిశలా చాటేలా, ప్రతి హృదయం ఉప్పొంగేలా పండుగ వాతావరణంలో నిర్వహించాలని స్పీకర్ సూచించారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర రాజధాని వరకు, రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 2వ తారీఖు నుంచి 21 రోజుల పాటు ఈ ఉత్సవాలు జరుపుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్, జిల్లా ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు పోచారం సురేందర్ రెడ్డి, బాన్సువాడ మున్సిపల్ చైర్మన్, జిల్లా రైతు సమన్వయ కన్వీనర్ అంజిరెడ్డి, జిల్లా అధికారులు, వివిధ డివిజన్ అధికారులు, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలి..

ఎడపల్లి : దశాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని తహసీల్దార్ ఆకుల శేఖర్ అన్నారు. మంగళవారం మధ్యాహ్నం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో పాటు గ్రామపంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఆకుల శేఖర్ మాట్లాడారు. జూన్ రెండవ తేదీన ఉత్సవాల ప్రారంభోత్సవం సందర్భంగా ప్రతి గ్రామ పంచాయతీ వద్ద జాతీయ జెండాలను ఆవిష్కరించాలన్నారు. జూన్ రెండవ తేదీ నుంచి 22వ తేదీ వరకు ఈ ఉత్సవ కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహించాలని ఆయన సంబంధిత అధికారులకు సూచించారు.

రాజంపేట్ : దశాబ్ది ఉత్సవాలు విజయవంతం చేయాలని మండల అభివృద్ధి అధికారి బాల కిషన్ అన్నారు. మండల అభివృద్ధి కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో పంచాయతీ కార్యదర్శులకు దశాబ్ది ఉత్సవాల గురించి వివరించారు. అందరూ బాధ్యతాయుతంగా జూన్ 2 నుంచి 22 దశాబ్ది ఉత్సవాలు విజయవంతం చేసేలా పనిచేయాలని సూచించారు. అట్లాగే దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చెరువుల పండుగ రైతు వేదికల వద్ద నిర్వహించే పండుగలా, అన్ని తేదీలలో ప్రతిరోజు పాల్గొనాలని ఆయన తెలిపారు. జూన్ రెండవ తేదీ ఉదయం 8 గంటలకు అన్ని గ్రామపంచాయతీలో పతాకావిష్కరణ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఇంజనీర్ ఆనందం, డివిజన్ వ్యవసాయ అధికారి, ఏపీవో భాస్కర్, మండల వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.



హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

సీఐటీయూ ఆవిర్భావ వేడుకలు



వర్ని : స్వీట్లు తినిపించుకుంటున్న నాయకులు



ఎడపల్లిలో జెండావిష్కరణ

నవతెలంగాణ-వర్ని/ఎడపల్లి

సీఐటీయూ 53వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వర్ని మండల కేంద్రంలో సీఐటీయూ కార్యాలయం వద్ద మండల కన్వీనర్ మంగాదేవి జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం కేక్ కట్ చేసి, స్వీట్లు పంచిపెట్టారు. కార్మికుల హక్కుల కోసం సీఐటీయూ రాజీలేని పోరాటాలు చేస్తుందన్నారు. ప్రభుత్వాలు కార్మికులు కష్టజీవులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే సీఐటీయూ జెండా కింద పోరాడుతామని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నన్నేసాబ్, చందూరు మండల కన్వీనర్ సాయిరెడ్డి, లత, జోత్స్న తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లిలో సీఐటీయూ జెండావిష్కరణ..

ఎడపల్లి : మండల కేంద్రంలోని పాత బస్టాండ్ సమీపంలో గల గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సీఐటీయూ 53వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా ఎడపల్లి మండల సీఐటీయూ కార్యదర్శి జంగం గంగాధర్ ఆధ్వర్యంలో జెండావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసంఘటిత కార్మికుల హక్కుల సాధనకై సీఐటీయూ ఎల్లప్పుడూ ముందుంటుందని గుర్తు చేశారు. సీఐటీయూ పోరాటం ద్వారానే అసంఘటిత కార్మికులకు ప్రభుత్వం వేతనాలను పెంచుతుందని ఆయన ఈ సందర్భంగా అన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేత



ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్న ఏసీపీ

నవతెలంగాణ-బోధన్

విశ్వకర్మ ఉద్యోగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బోధన్ పట్టణంలోని విశ్వకర్మ భవనంలో బోధన్ డివిజన్ ప్రతినిధులు విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను మంగళవారం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బోధన్ డివిజన్ ఆధ్వర్యంలో 2023 సంవత్సరం 10వ తరగతిలో ఉత్తీర్ణులైన 22 మంది విశ్వబ్రాహ్మణ విద్యార్థులకు ప్రొఫెసర్ జయశంకర్ ఆచార్య ప్రతిభా పురస్కారాలు అందజేసినట్టు జిల్లా అధ్యక్షులు గోపాలకృష్ణ ఆచార్య అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బోధన్ డివిజన్ ఏసీపీ కేఎం కిరణ్‌కుమార్ హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ.. ఇంటర్మీడియట్ స్థాయి నుంచి విద్యార్థులు తమ లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని సూచించారు. ప్రతి సంవత్సరం విద్యార్థిని విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలతో సన్మానిస్తున్న విశ్వకర్మ ఉద్యోగుల సంక్షేమ సంఘం బోధన్ డివిజన్ వారిని అభినందించారు. కార్యక్రమంలో బోధన్ డివిజన్ అధ్యక్షులు పరమేశ్వర ఆచార్య, గౌరవ అధ్యక్షులు మురారి ఆచార్య, ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, కోశాధికారి వేణు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏ కిరణ్ కుమార్ ఆచార్య, కే శివాజీ, కే శ్రీనివాస్, వై.శివానంద్, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు కాళిదాస్ చారి, మనుమయా సంఘం అధ్యక్షులు వడ్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో బోనాల పండుగ



లింగంపేట్ : బోనాలను ఊరేగిస్తున్న ముదిరాజ్‌లు



ఎల్లారెడ్డి : లక్ష్మాపూర్‌లో..

నవతెలంగాణ-లింగంపేట్/ఎల్లారెడ్డి

మండల కేంద్రంలో ముదిరాజ్ కులస్తులు పెద్దమ్మ బోనాలను మంగళవారం తీశారు. ఇంటింటికి బోనాలను అలంకరించి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు చేపట్టారు. ఆలయం చుట్టూ ఐదు సార్లు ప్రదర్శన నిర్వహించి అమ్మవారి ఆలయం ముందు బోనాలను ఉంచారు. అనంతరం అమ్మవారి ఓడి బియ్యం పోసి నైవేద్యం సమర్పించారు.

లక్ష్మపూర్‌లో పెద్దమ్మ తల్లి బోనాలు..

ఎల్లారెడ్డి : మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో పెద్దమ్మ తల్లి బోనాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు తమ ఇండ్ల నుంచి అందంగా అలంకరించిన బోనాలు ఎత్తుకొని గ్రామ శివారులోని పెద్దమ్మ తల్లి ఆలయం వరకు డప్పుచప్పుల మధ్య ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. అలాగే అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు.

జీలుగ విత్తనాలు పంపిణీ



రాజంపేట్ : జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్న చైర్మెన్

నవతెలంగాణ-రాజంపేట్/భిక్కనూర్

మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులకు పెద్దజనులు, జీలుగ విత్తనాలు మంగళవారం పంపిణీ చేసినట్టు పీఏసీఎస్ చైర్మన్ నల్లవెల్లి అశోక్ పేర్కొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రైతులకు అందుబాటులో విత్తనాలు ఉంచనున్నట్టు ఆయన తెలిపారు. సొసైటీ పరిధిలో ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. రైతుబంధు మండలాధ్యక్షులు మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ రమేష్, డైరెక్టర్లు బాలయ్య, గ్రామ రైతు బంధు కన్వీనర్ శ్రీరామ్ సురేష్, సాయిబాబా, శ్రీరామ్, కాసం బసవయ్య, సుధాకర్‌రెడ్డి, సునీత, వాజిత్ అలీ, నాయకులు కో ఆప్షన్ మెంబర్ అహ్మద్ అలీ, జోగిపేట లింగారెడ్డి, కట్లకుంట సిద్ధిరాములు, శంభుగల ప్రభుకుమార్, బీఆర్ఎస్ రాజంపేట కార్యదర్శి మచ్చ భాస్కర్, కొప్పుల నరేష్, పిట్ల స్వామి, బుర్ర నరేష్, తదితరులు రైతులు పాల్గొన్నారు.

భిక్కనూర్ : సొసైటీ ఆధ్వర్యంలో సొసైటీ అధ్యక్షులు భూమయ్య జీలుగ విత్తనాలు మంగళవారం పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. రైతులకు కావలసిన ఎరువులు విత్తనాలు అందించనున్నట్టు తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రాయితీపై అందిస్తున్న జీలుగ విత్తనాలు రైతులు కొనుగోలు చేయాలని సూచించారు. సొసైటీ ఉపాధ్యక్షులు రాజిరెడ్డి, నాయకులు మల్లేశం, నర్సింలు, మైపాల్ రెడ్డి, మోహన్‌రెడ్డి, సాయిలు, సీఈఓ నరసింహులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రతి మంగళవారం మహిళలకు ప్రత్యేక క్యాంపు

- జిల్లా ఆరోగ్యశాఖ అధికారి లక్ష్మణ్ సింగ్

నవతెలంగాణ-మద్నూర్

ప్రతి మంగళవారం మహిళల కోసం ప్రత్యేక క్యాంపు నిర్వహిస్తున్నట్టు జిల్లా ఆరోగ్యశాఖ అధికారి లక్ష్మణ్ సింగ్ తెలిపారు. మంగళవారం డోంగ్లి మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ఆరోగ్యశాఖ అధికారి లక్ష్మణ్ సింగ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డొంగ్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి మంగళవారం మహిళలకు ప్రత్యేక క్యాంపు నిర్వహించి రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు వివరించారు. రోగ నిర్ధారణ పరీక్షలను బట్టి వైద్యం అందించనున్నట్టు తెలిపారు. మహిళలు ప్రత్యేకంగా హాజరై రోగ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని వైద్యాధికారి సూచించారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలు చేస్తున్న జిల్లా వైద్యాధికారి

బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తే కఠిన చర్యలు

నవతెలంగాణ-గాంధారి

బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు గాంధారి ఎస్ఐ డి.సుధాకర్ తెలిపారు. మండలంలోని రెండు చోట్ల బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న ఇద్దరు వ్యక్తులైన గాంధారి మండల కేంద్రానికి చెందిన కమ్మరి నాగభూషణం, నిజాంసాగర్ మండలానికి చెందిన కోకొండ సాయిలుపై కేసు నమోదు చేసినట్టు గాంధారి ఎస్ఐ సుధాకర్ తెలిపారు. బహిరంగ ప్రదేశంలో మద్యంసేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు.

ఆర్థిక సహాయం చెక్కు అందజేత



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
మండలంలోని బషీరాబాద్ గ్రామానికి చెందిన లబ్దిదారు అల్లకొండ లహరికి ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ.25వేల చెక్కును మంగళవారం లబ్దిదారు ఇంటికి వెళ్లి సర్పంచ్ సక్కారం అశోక్, బిఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు బైకాన్ మహేష్ అందజేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల సోషల్ మీడియా కన్వీనర్ బోడ దేవేందర్, నాయకులు లక్క శ్రీనివాస్, అవుసుల చారి, అవుసుల సునీల్, తూర్పు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మెండోర సమాఖ్యలో ఈసీ సమావేశం

నవతెలంగాణ-మెండోర
మండల కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలో ఏపియం విక్రమ్ రెడ్డి ఆధ్వర్యంలో ఈసి సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఐబీ , బ్యాంక్ లింకేజి, స్త్రీ నిధి, ఎంటర్ ప్రైజెస్ లతో పాటు పలు అంశాలపై మహిళ సంఘ సభ్యులతో సమీక్ష నిర్వహించారు.అందులో భాగంగా తెలంగాణ దశాబ్ది ఉత్సవాల వేడుకలను విజయవంతంగా జరిగించుటకు చర్చలు జరిపారు. సమావేశంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మి , ఈసి సభ్యులు , మండల సమైక్య కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

2నుంచి తెలంగాణ ప్రజా ఆకాంక్షల దీక్షా దివస్

- ప్రజాపంథా రాష్ట్ర నాయకులు ప్రభాకర్

నవతెలంగాణ-ఆర్మూర్
తెలంగాణ ఆవిర్భావం సందర్భంగా తెలంగాణ ప్రజాఆకాంక్షల దీక్ష దివస్‌ను జూన్ 2 నుంచి 12 వరకు జరపాలని ప్రజాపంథా రాష్ట్ర నాయకులు వి ప్రభాకర్ పిలుపునిచ్చారు. సిపిఎంఎల్ ప్రజాపంథా పార్టీ ఆధ్వర్యంలో కుమార్ నారాయణ భవన్‌లో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా ఏడవ రాష్ట్ర మహాసభల సందర్భంగా దీక్ష దివాస్ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాలని పిలుపునిచ్చిందని తెలిపారు. ఈ సందర్భంగా . ప్రభాకర్ బి.దేవారం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ప్రభుత్వం దశాబ్ది ఉత్సవం పేరుతో పెద్ద ఎత్తున సంబరం జరుపుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థి బలిదానాలపైన రాజకీయాలు చేస్తూ ఇచ్చిన హామీలను పక్కనపెట్టి దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రజలను, మేధావులను, విద్యార్థులను మరోసారి మోసం చేయడానికి ప్రయత్నం చేస్తుందని తెలిపారు. తెలంగాణ వస్తే తెలంగాణలో కాంట్రాక్టు అనే పదమే ఉండదని పోడు చేసుకుంటున్నా గిరిజనులకు, గిరిజన ఇతరులకు పోడు భూముల పట్టాలు ఇస్తామని, ఇల్లు లేని వారికి డబుల్ బెడ్ రూమ్‌లు నిర్మిస్తామని, ఎస్సీ, ఎస్టీ గిరిజనులకు భూమిలేని వారికి మూడు ఎకరాల భూమిని ఇస్తామని, రైతులకు రుణాలను మాఫీ చేస్తామని, వలసలను అరికడతానని హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కెసిఆర్ ప్రభుత్వం నేడు దానికి విరుద్ధంగా పాలన చేస్తుందన్నారు. కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగ ఖాళీలన్నీ భర్తీ చేయాలని, రైతు రుణాలను మొత్తం ఏకకాలంలో మాఫీ చేయాలని, పోడు భూములన్నింటికీ పట్టాలు ఇవ్వాలని, గిరిజనేతర పేదలకు సాగు హక్కు కల్పించాలని, రేషన్ కార్డులు పెన్షన్లు ఇండ్ల స్థలాలు అర్హులందరికీ ఇవ్వాలని ధరణి వెబ్సైట్ అవకతవకాలను వెంటనే సరి చేయాల నీ అన్నారు. ఉపా చట్టం రద్దు చేయాల నీ. దళితులకు మూడు ఎకరాల భూమి ఇవ్వాలని నిరుద్యోగులు అందరికీ పదివేల రూపాయలు నిరుద్యోగ భృతి ఇవ్వాలని, ప్రాజెక్టులకు పంట కాలువలు తీయాలని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎంఎల్ ప్రజాపంథా సబ్ డివిజన్ కార్యదర్శి బి కిషన్ నాయకులు నజీర్ శ్రీనివాస్ బోట్ల రాజు విజయ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు ప్రభాకర్

పలుగడ్డ ఉన్నత పాఠశాల పరిశీలన


పాఠశాలను పరిశీలిస్తున్న జడ్పీటీసీ

నవతెలంగాణ-దోమకొండ
మండల కేంద్రంలోని పలుగడ్డ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జడ్పీటీసీ తీగల తిరుమల్‌గౌడ్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ తీగల తిరుమలగౌడ్ మాట్లాడుతూ.. మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ఆదేశాల మేరకు పాఠశాలలోని రూ.72 లక్షలతో డైనింగ్ హాల్, నాలుగు తరగతి గదులు, టాయిలెట్స్ మరమ్మతు పనులు, విద్యుత్ మరమ్మతు పనుల నిమిత్తం కొరకు ప్రభుత్వం ద్వారా నిధులను ప్రభుత్వ విప్ మంజూరు చేయించినట్టు తెలిపారు. పాఠశాలలో పనులు వేగవంతంగా పూర్తి అవుతున్నాయన్నారు. మన ఊరు మనబడి కార్యక్రమంలో దోమకొండ మండలంలోని చింతామణిపల్లి, అంబర్‌పేట గ్రామాలలో పాఠశాలల పనులు పూర్తి అయినట్టు తెలిపారు. వచ్చేనెల జూన్ 2 నుంచి తెలంగాణ రాష్ట్ర పదవ అవతరణ దినోత్సవంలో భాగంగా పనులు పూర్తి చేసుకున్న పాఠశాలలను ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ప్రారంభిస్తారని తెలిపారు. ప్రభుత్వ విప్ కృషితో దోమకొండ మండలంలో నాలుగు ప్రైమరీ పాఠశాలలు, నాలుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా పనులు జరుగుతున్నాయని వచ్చేనెల 12 నుంచి పాఠశాలలు ప్రారంభమవుతున్నందున పనులు తొందరగా పూర్తి చేయాలని ప్రభుత్వ విప్‌కు సూచించినట్టు జడ్పీటీసీ తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌కు దోమకొండ జడ్పీటీసీ తీగల తిరుమల గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కానుగంటి శారద నాగరాజు, సర్పంచ్ నల్లపు అంజలి శ్రీనివాస్, విండో చైర్మన్ పన్యాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన నిరుపేదలందరికీ ఇండ్ల స్థలాలు, రుణాలు ఇవ్వాలి

సీపీఐ(ఎం) నాయకుల డిమాండ్


మాట్లాడుతున్న నాయకులు ద్యారంగుల కృష్ణ

నవతెలంగాణ-కంఠేశ్వర్
నిజామాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భూ పోరాటం మంగళవారం 6వ రోజు చేరుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నగర కమిటీ సభ్యులు ధ్యారంగుల కృష్ణ మాట్లాడుతూ.. ఆరు రోజులుగా భూ పోరాటం కొనసాగుతున్న ఇప్పటివరకు అధికారులు వచ్చి నిరుపేదల సమస్యలు ఏంటో తెలుసుకునే పాపన పోలేదని విమర్శించారు.అదేవిధంగా నిజామాబాద్ నగరంలో అనేక సంవత్సరాల నుండి అద్దె ఇండ్లలో నివసిస్తున్న నిరుపేదలందరూ భూ పోరాటంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అలాగే భూ పోరాటానికి మద్దతుగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం గోవర్ధన్, నగర కార్యవర్గ సభ్యులు కటారి రాములు, బెజ్జం సుజాత, మహేష్ నగర కమిటీ నాయకులు నాల్వల నర్సన్న, బొప్పిడి అనసుజమ్మ. ఐద్వా నాయకులు కే లావణ్య, పి కళావతి, డివైఎఫ్ఐ నాయకుల ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలను అట్టహాసంగా చేపట్టాలి

- ఎంపిపి ఆర్మూర్ మహేష్



మాట్లాడుతున్న ఎంపీపీ మహేష్


నవతెలంగాణ-భీంగల్
తెలంగాణ రాష్ట్ర అవతరణ అవతరణ దినోత్సవం జూన్ 2 నుండి 22 వరకు జరిగే దశాబ్ది ఉత్సవాలను ప్రతి గ్రామంలో అట్టహసంగా జరుపుకోవాలని యంపిపి ఆర్మూర్ మహేష్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, యంపిటీసిలు, కార్యదర్శులతో సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ఈ ఉత్సవాలలో అన్ని శాఖల అధికారులు, సర్పంచ్‌లు, యంపిటీసి, బీఆర్ఎస్ నాయకులు కార్యర్తులు బాగస్వాములు కావాలన్నారు. దశాబ్ది ఉత్సవాలు ప్రపంచ చరిత్రలో నిలువాలన్నారు. కార్యమంలో జెడ్పీటిసి చౌట్‌పల్లి రవి, యంపిడివో రాజేశ్వర్, తహసీల్దార్ శ్రీధర్‌కుమార్, ఎంపిఓ గంగమోహన్, ఏయంసీ చైర్మన్ గుబ్‌వీర్‌రెడ్డి, భీంగల్, ముచ్కూర్ సొసైటీ చైర్మన్‌లు నర్సయ్య, వెంకటేష్ , ఏపిఓ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు

వీఏవోల సమ్మె విరమణ

నవతెలంగాణ-భీంగల్
తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతు వీఏవోలు చేపట్టిన సమ్మె మంగళవారం విరమించారు. గత నెల24 న చేపట్టిన సమ్మె 36 రోజులుగా నిరంతరాయంగా చేపట్టారు. మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, హరీష్ రావ్, ఎర్రబెల్లి దయాకర్ రావులు సానుకూలంగా స్పందించి తమ సమస్యల పరిష్కారానికి జిల్లా నాయకులకు ఇచ్చిన హమీ మేరకు సమ్మె విరమించామన్నారు. సమ్మె విరమణ పత్రాన్ని ఏపియం కు అందజేసినట్లు వారు తెలిపారు

ఆస్తి తగాదాల వల్ల వృద్ధురాలు మృతి

నవతెలంగాణ-మోపాల్
ఆస్తి తగాదాలతో మండల కేంద్రంలో ఓవృద్ధురాలు మృతిచెందింది. ఎస్సై మహేష్ వివరాల ప్రకారం.. జంగం పరువవ్వ (70) కొడుకు జంగం రాజేశ్వర్, కోడలు లావణ్య తరచూ ఆస్తి కోసం వేధిస్తూ కొట్టేవారు. దీంతో ఆమె ఆరోగ్యం క్షీణించింది. వృద్ధురాలిని సోమవారం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మరణించింది. తన తల్లిని కొడుకు. కోడలు వేధించడం. కొట్టడం వల్లే ఆరోగ్యం దెబ్బతిని చనిపోయిందని, ఆమె కూతురు జంగం విజయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



సివిల్స్ ర్యాంకర్‌కు సన్మానం

నవతెలంగాణ-బోధన్
పట్టణంలోని శక్కర్‌నగర్‌కు చెందిన కంఠం మహేష్ సివిల్స్ జాతీయ స్థాయిలో 200 ర్యాంకు సాధించడంతో మంగళవారం మాజీమంత్రి సుదర్శన్‌రెడ్డి మహేష్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంఠం మహేష్ ఈ స్థాయిలో పేరు సాధించడానికి ప్రోత్సహించిన ఆయన తల్లిదండ్రులను అభినందించారు. భవిష్యత్తులో బోధన్ మంచి పేరు ప్రఖ్యాతలను తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో బోధన్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు పాషా మోహినుద్దీన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు అంతిరెడ్డి రాజారెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన కార్యదర్శి దొడ్ల రవీందర్‌రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి విష్ణు వర్ధన్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ గౌస్ ఉద్దీన్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నరేందర్‌రెడ్డి, యూత్ ప్రెసిడెంట్ తల్లారి నవీన్, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, లింగం, గంగాధర్, పల్లెన్న, బడూ, సాజిద్, ఇనాయత్ అలీ పాల్గొన్నారు.


సివిల్ ర్యాంకర్‌ను సన్మానిస్తున్న మాజీ మంత్రి

సివిల్స్ ర్యాంకర్‌ను సన్మానించిన మాల మహానాడు నాయకులు..
బోధన్ పట్టణానికి చెందిన కంఠం మహేష్ సివిల్స్‌లో ఉత్తమ ప్రతిభ చూపడంతో మంగళవారం మాల మహానాడు నాయ కులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా విజిలెన్స్ మాని టరింగ్ కమిటీ సభ్యులు పెర్క కృష్ణ, మాల మహానాడు జిల్లా నాయకులు ఎల్లయ్య మాట్లాడుతూ.. మహేష్ సివిల్స్‌లో 200వ ర్యాంక్ సాధించడం దళిత జాతికి గర్వకారణమని అన్నారు. ఈ ఘనత సాధించిన మహేష్ రాబో యే రోజుల్లో మంచి అధికారిగా ఉన్నత పదవుల్లో చేరి ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎడ్ల నాగరాజు, జిల్లా కార్యదర్శి నాంది వినయ్ కుమార్, జిల్లా నాయకులు నల్ల బాలరాజు, జిల్లా ఉపాధ్యక్షులు అనది గంగాధర్, రవీంద్రబాబు, మోహన్, నరేష్, గంగాధర్, ఉత్తమ్, సాయిలు, సాయోజి, ప్రసాద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాజిరెడ్డి జగన్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి
బీఆర్ఎస్ యువ నాయకుడు, జిల్లా పరిషత్ ఆర్థిక ప్రణాళిక సంఘం సభ్యులు, ఒలింపిక్ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు, ధర్పల్లి జడ్పీటీసీ బాజిరెడ్డి బాజిరెడ్డి జగన్ పుట్టినరోజు సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, ఆసుపత్రి, అనాధ శరణాలల్లో పండ్ల పంపిణీ, రక్తదానం చేశారు. సోమవారం రాత్రి నుండే ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ నివాసం వద్ద డిచ్‌పల్లి, ఇందల్ వాయి మండలాలకు చెందిన సర్పంచులు ఎంపిటిసిలు, జిల్లా, మండల, గ్రామాల నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో చేరుకుని కేక్ కటింగ్ చేసి సంబురాలను ఘనంగా నిర్వహించారు. డిచ్‌పల్లి మండల కేంద్రంలోని శ్రీ కాశీ విశ్వనాథేశ్వరుని ఆలయ వేద పండితులు బాజిరెడ్డి జగన్‌ను ప్రత్యేకంగా ఆహ్వానించారు. బాజిరెడ్డి జగన్ సతీ సమేతంగా హాజరై స్పటిక లింగేశ్వరున్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు రుద్రాభిషేకం చేశారు. అనంతరం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చింత శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జన్మదిన వేడుకల్లో పాల్గొనీ కేక్ కట్ చేశారు. కార్యకర్తలు శాలువా పూల మాలలతో ఘనంగా సన్మానించారు. డిసిఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్, ఎంపిపి బాదవత్ రమేష్ నాయక్, జడ్పిటిసి దాసరి ఇందిరా లక్ష్మీ నర్సయ్య, సర్పంచులు మమత శేఖర్, తేలు విజయ్ కుమార్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు లోలం సత్యనారాయణ, సామాజిక కార్యకర్త పులి సాగర్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు దండుగుల సాయిలు, మాజీ మండల అధ్యక్షుడు శక్కరి కొండా కృష్ణ, పిఎసిఎస్ చైర్మన్ గజవాడ జైపాల్, కో- ఆప్షన్ మెంబర్ షేక్ నయీమ్, మోహమ్మద్ యూసుఫ్ పాల్గొన్నారు.


డిచ్‌పల్లిలో..



ఇందల్‌వాయిలో పాల్గొన్న సర్పంచ్‌లు

ఓటరు నమోదుపై బీఎల్‌ఓలకు అవగాహన

నవతెలంగాణ-నసురుల్లాబాద్
ఓటరు పేరు నమోదు, ఓటు హక్కు వినియోగంపై నసురుల్లాబాద్ రైతువేదిక భవనంలో బీఎల్‌ఓలకు మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన రెవెన్యూ అధికారి హన్మండ్లు మాట్లాడుతూ.. బూత్‌లెవెల్ అధికారులు ప్రతిగడపకూ వెళ్లి ఆ ఇంట్లో ఎంతమంది ఓటరుగా నమోదు కాలేదు?, ఉన్నవారు ఓటుహక్కు వినియోగించుకుంటున్నారా లేదా అలాగే ఇదివరకు ఓటరుగా నమోదు అయినవారు మార్పులు, చేర్పులకు అవకాశం వినియోగించుకోవాలని తెలియజేయాలన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్క యువతీ యువకులకు ఓటు హక్కు వినియోగం, ఓటరు కార్డు దరఖాస్తు చేసుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో బూతు లెవెల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న అధికారి

వీరశైవ లింగాయత్‌లను విడదీసే యత్నాన్ని వ్యతిరేకించాలి

- ఏఎంసీ చైర్మెన్ వెంకటేశ్వర్ రావు దేశాయ్

నవతెలంగాణ-బోధన్
వీరశైవ లింగాయత్‌లను విడదీసేందుకు కొందరు చేస్తున్న ప్రయత్నాలను వ్యతిరేకించాలని వీరశైవ లింగాయత్ సమాజ్ నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల అధ్యక్షులు వీఆర్ దేశాయ్, కందారే దిగంబర్‌రావు అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కర్ణాటక రాష్ట్రం నుంచి కొందరు నాయకులు రాజకీయ లబ్ది కోసం తెలంగాణలోకి వచ్చి వీర శైవులు, లింగాయత్, లింగ బలిజలు వేర్వేరంటూ గ్లోబల్ ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ నాయకత్వంలో వీరశైవ లింగాయత్ ఫెడరేషన్ పటిష్టంగా, ఐక్యతతో ఉందని తెలిపారు. దివంగత సీఎం వైఎస్ఆర్ హయాంలో అప్పటి జిల్లా ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, ఎస్.గంగారాం, పోచారం శ్రీనివాసరెడ్డి, జహీరాబాద్ మాజీ ఎంపీ సురేష్ షెట్కార్ సహకారంతో వీర శైవ లింగాయత్‌ను బీసీ జాబితాలో చేర్చారని, కేంద్రం ప్రభుత్వ పరిధిలో విద్య, ఉద్యోగాల కోసం ఓబీసీలో చేర్చేందుకు బీబీ పాటిల్ నాయకత్వంలో ప్రయత్నాలు జరుగుతున్నాయని త్వరలోనే మన ఆకాంక్ష నెరవేరబోతుందని తెలిపారు. వీరశైవ లింగాయత్‌లను విడకొట్టే యత్నంలో భాగంగా జూన్ 4న హైదరాబాద్‌లో కొందరు తలపెట్టిన ర్యాలీకి వీరశైవ లింగాయత్ సమాజ్ వ్యతిరేకిస్తోందని, ఈ ర్యాలీకి ఎవరూ వెళ్లవద్దని కోరారు.


మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు

కొనసాగుతున్న రాష్ట్ర సాఫ్ట్‌బాల్ జట్టు శిక్షణ శిబిరం

నవతెలంగాణ-ఆర్మూర్
పట్టణంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ బాలుర పాఠశాల క్రీడా మైదానంలో మినీ సబ్ జూనియర్ రాష్ట్ర సాఫ్ట్ బాల్ బాల బాలికల జట్ల శిక్షణ శిబిరం మంగళవారం కొనసాగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డాక్టర్ రాకేష్ (బాలాజీ హాస్పిటల్) విచ్చేసి క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ క్రీడల వల్ల క్రమశిక్షణ మంచి నాయకత్వ లక్షణాలు పెంపొం దుతాయన్నారు. చిన్నతనంలోనే రాష్ట్ర జాతీయ పోటీల్లో పాల్గొంటున్నందుకు అభినందిస్తూ క్రీడాకారులకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో టిటియు జిల్లా అధ్యక్షులు పెంట జలంధర్, జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగా మోహన్, సభ్యులు నల్లూరి లత, జోష్న, రంజిత్, కోచ్‌లు పాల్గొన్నారు.

బీసీ గురుకుల కాలేజీకి విద్యార్థుల ఎంపిక

నవతెలంగాణ-రాజంపేట్
మండలంలోని తలమడ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఏప్రిల్ నెలలో రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన మహాత్మా జ్యోతిభా పూలె బీసీ గురుకుల జూనియర్ కాలేజీ ప్రవేశ పరీక్షలో పాఠశాల నుంచి 10 మంది విద్యార్థులు ప్రవేశం పొందారని ప్రధానోపాధ్యాయులు అంజల్ రెడ్డి మంగళవారం పేర్కొన్నారు. వీరిని ఎస్ఎంసీ చైర్మన్ స్వామి, సర్పంచ్ యాదవరెడ్డి, ఉపసర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, ఎంపీటీసీ రాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

బీజేపీ, బీఆర్ఎస్ రెండూ ఒక్కటే

- నియోజకవర్గ జోన్ సమావేశంలో శశికళ యాదవరెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్
బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఒకరికొకరు లోబాయికార ఒప్పందాలతో పనిచేస్తున్నారని, రెండు పార్టీలు ఒకటేనని, బయటకు గొడవలు పడుతూ ప్రజలను మభ్యపెడుతున్నారని బోధన్, నిజామాబాద్ నియోజకవర్గ ఇన్చార్జ్ శశికళ యాదవ రెడ్డి అన్నారు. నిజామాబాద్‌లోని కాంగ్రెస్ భవన్‌లోగల నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కేశ వేణు ఆధ్వర్యంలో నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ జోన్ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా బోధన్, నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గాల ఇంచార్జి శశికళ యాదవ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, పిసిసి ఉపాధ్యక్షులు తాహెర్ బిన్ హందాన్, పిసిసి ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, పార్టీ కార్యకర్తలు, నాయకులు మరింత ఉత్సాహంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షులు అయ్యాక పార్టీని బలోపతం చేసే దిశగా మండల, డివిజన్ కమిటీలు వేసే ప్రక్రియను మొదలు పెట్టారని అన్నారు. పార్టీ కోసం పనిచేసే వారిని కమిటీలోకి తీసుకోవాలని ఆమె అన్నారు. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చి తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీకి బహుమతిగా ఇవ్వాలని ఆమె అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఉపధ్యక్షుడు రమర్తి గోపి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు విక్కీ యాదవ్, ఓబీసీ అధ్యక్షులు రాజ నరేందర్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కేశ మహేష్, అబుద్‌బిన్ హందన్, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షులు జావిద్ అక్రమ్, పిసిసి మెంబర్ ఈసా, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రత్నాకర్, నగర యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ప్రీతమ్, నగర మైనారిటీ అధ్యక్షులు ఏజాజ్, నగర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రేవతి, మలైకా బేగం, పద్మ అయుబ్, అబ్దుల్ రషీద్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడతున్న శశికళ యాదవరెడ్డి